


"వెయ్యి శూన్యాలు అర్చినా ఈ మాట వెనక్కి తియ్యడం లేదు. అసలు కారణాన్ని కనిపెట్టనిదే నిద్రపోతే ఒట్టు" అన్నాడు వేమయ్య. ఈ మాటకు ఇంట్లో ఎవరూ సమాధానం చెప్పలేదు. వేమయ్య మాటంటే ఇంట్లో అందరికీ విపరీతమైన భయం. భయాన్ని కంటిపెట్టుకొన్నది తరతరాల కుటుంబ గౌరవం. అతనికి ఏ మంత ఆస్తి పాస్తులు లేక పోయినా లేత మామిడి తోట నిరుడే కాతకు వచ్చింది ఒక్కటి ఉంది. అదొక్కటి చాలు. ఆ తోట కాతకు రావడంతోటే తనపై గ్రామంలో గిట్టనివారు కన్ను వేశారని అతని అనుమానం. పొరుగు బతికితే పొయ్యిలో నీళ్ళు పోసుకునే రకం. లేకుంటే మామిడి తోట పూవతూ అమాంతంగా ఎండిపోతుందా? ఏదో చేరుపు చేశారు. తప్పకుండా చేశారనే అతని ఉద్దేశం! ఈ విషయాన్ని ఆమూలాగ్రం తీయాలంటే ఎవరికీ సాధ్యం కాదు. ప్రత్యేకంగా తర్ఫీదైన గూఢచారుల కిలాంటి విషయాలు అసలు అర్థం కావు. దానికి తగిన మనుష్యు లున్నారు.

అందుకే వేమయ్య మీసాలను వెలివేసి అన్నాడు "వాడెవడో సిరికి వాడు గుండెకాయ లుంటే తెలిసి చెయ్యాలి. ఇలాగా శూన్యాలు పెట్టడం ఎందుకు? తెలుసుకొంటాను" అన్నాడు.

ఆ దినం సాయంకాలం బస్సుకే ఇంటివద్ద జాగ్రత్తగా చూసుకోమని హెచ్చరికచేసి బయలు దేరాడు.

శూన్యాల గురవయ్య సిద్ధహస్తుడు ఇలాంటి విషయాల్లో. అతని పేరు ప్రాంతంలో మ్రోగి పోతోంది. అంజని కప్పు వేశాడంటే అసలు కథ తేలి పోతుంది. అతడేమైనా చేయగలడు. అతని అనుభవంలో దాదాపు ఐదువేల దయ్యాలను తరుము గొట్టాడు. ఏ ఒక్కటికి రెండో మొండికి వేయడం తప్ప మిగిలిన వాటి కతని పేరు వింటేనే చాలు. పారిపో తాయి. అదిగో బాదరా చేతికిచ్చిన రాళ్ళనెత్తి తలల మీద పెట్టుకొని సెలవు పుచ్చు కొంటాయి.

వేమయ్య గురవయ్య పేరు విన్నాడు గానీ, ఎన్నడూ చూచి ఎరుగడు. వెళ్ళిన సమయంలో ఇంటి పట్టునే ఉన్నాడు. వేమయ్యను చూచిందే చేతితో సంజ్ఞ చేశాడు. ప్రక్కనుండిన శిష్యులు ముక్కాలి పీట తెచ్చి వేశారు.

గురవయ్య ఏమీ మాట్లాడలేదు. అతడు పట్టపు దేవతను పిలుస్తు న్నాడు. అక్కడ కూర్చున్న అమ్మాయి తలగుడ్డ వేసుకుని ఏడు వ్యక్తుల్ని పిలుస్తున్నది గానీ పలకడం లేదు. ఇలా పావుగంట గడిచాక గురవయ్య గర్జించాడు. వేమయ్య ఎంతో ధైర్యవంతుడైనప్పటికీ గుండె కొంచెం బెదిరిందనే చెప్పాలి.

ఆ స్త్రీమూర్తి ఐదు నిమిషాలు ఊగి స్పృహ తప్పి పడిపోయింది. ఆ వెనుక గురవయ్య ఒంటారు నిక్కి చల్లి లేపాడు.

ఆమె వెళ్ళిపోగానే వేమయ్యతో తిరిగి మాట్లాడాడు. విషయం తెలుసుకొని అంజని కప్పు వేసే పనితో సన్నాడు. ఆ రాత్రి తెల్లవారే వరకు కర్పూరం కావలసిందంతా దగ్గర ఉంచుకొని కూర్చున్నాడు.

గురవయ్య చూస్తున్నాడు. అతనికి ప్రపంచ మంతా కన్పిస్తున్న దందులో. ఆఫ్రికాలోని జిరాఫీలు, ఆస్ట్రేలియాలోని గొర్రెలు, అస్త్రేలియా గుర్రాలు ఒక్కటేమిటి భూమి మీద ఉన్నవన్నీ చూడ గల్గుతున్నాడు.

"కన్పించిందా?" ప్రశ్నించాడు వేమయ్య.

"ఆ .. ఆ... వెంకటిల్లే గదండి?" అన్నాడు గురవయ్య.

"అవును."

"ముందు కొట్ట ముంది గదూ?"

"అవును."

వెనుక పెరడుంది గదూ?"

"ఆ ... ఆ ... అవునండి. అదే . అదే పెరటిలో బావి మామి మల్లెచెట్టు కూడా ఉందండి"

"అదే చెబుతున్నాగా. ఇప్పుడు మీ అమ్మ నీళ్ళు చేదుతున్నది.

"ఆ ... అలాగా?"

"ఇప్పుడే తోడి పోస్తున్నది."

"ఇంకేమ రున్నారు?"

"ఎవరో స్నానం చేస్తున్నారు . కాస్సేపాగండి ఒళ్ళో చూద్దాం ."

"అవును ఇప్పుడు బాడ్ఘం పాలం!" అన్నాడు శిష్యుడు.

ఐదు నిమిషాలయాయి "ఇప్పుడు చూడండి?" అన్నాడు వేమయ్య.

"ఆ .. అక్కడే ఆ బావికి దగ్గర మామి మల్లె చెట్టు క్రింద ఉన్నదండి పూడిక. అన్నాడు గురవయ్య "దాన్ని పైకి తీసే భారం మీదే అన్నాడు" వేమయ్య.

గురవయ్య అంజనాన్ని తుడిచి కళ్ళు నీళ్ళు కారుతుంటే ఆవ్యాలుతో ఒత్తుకున్నాడు.

"అస లేం జరిగింది?" ప్రశ్నించా డున్నట్టుండి గురవయ్య.

"ఆరుమందికి జీతాలిచ్చి పెట్టాను ముందు కొండలో. నీళ్ళు పాపిళ్ళు మోసి వారి భుజాలు కాయలు కాచాయి. ఇంత కష్టపడి పెంచిన తోటను కాతకు వచ్చే సమయం చూచి పూతల మీదే మాడ్చి వేశారు." అన్నాడు వేమయ్య.

ఇంతలో ప్రక్కనే వున్న రెండు కోడి పుంజులు వేమయ్య మీద పడినై.

"ఒరే కొండలూ! ఆ కోళ్ళనలా బైటికి తరుమూ" అన్నాడు గురవయ్య.

"వాటికి పుండ్లు మానలే దింకా. బైటికి పోతే పొడుచుకుంటాయి." అంటూ విసిగాడు కొండలు.

"ఏం పుండ్లా? కోళ్ళకేం?" ప్రశ్నించాడు వేమయ్య

"అబ్బే! అవి పుండ్లు కాదు లెండి. ఎక్కడ గాని కోసం జుట్టు కోస్తాయిగా! ఆ కోడినిక్కడే వదలి వెడుతారు." అన్నాడు నవ్వుతూ గురవయ్య. వేమయ్యకు అర్థమైంది. ఈ లోగా కొండలు ఆ రెండు కోడి పుంజులను బైటకు లాగాడు.

"మీ రెప్పుడు వస్తారూ?" ప్రశ్నించాడు వేమయ్య.

"ఆదివార మైతేనె ఈ పూడికలు పైట పడుతాయి. ఇదీ కృష్ణపక్షం గనక మంచిదే. రేపు ఆది వారం తప్పక వస్తాను. కావలసినవి సరిచేసి పెట్టండి

"కావలసిన వంటే ఏవి టో చెప్పకనే"

"ఒరే కొండలూ!"

"ఏమయ్యో!" కొండలు కోళ్ళను అదిలిస్తూ పిలుపు నందుకొని లోపలికి వచ్చాడు.

"లక్కడో కాగితం తీసుకొని పెన్సిలు ముక్క పట్టుకరా."

"చిత్తం" అంటూ కొండలు లోపలికెళ్ళాడు.


"ఖర్చులు ఏమున్నాయి లెండి! మీకు తెలిసిన విషయమేగా? ఎన్నిమైళ్ళుంటుంది మన ఊరు?" అన్నాడు గురవయ్య.

"ఎన్నో మైళ్ళు కాదండి! చిద్ది ప్రయాణం అదంత పెద్ద ప్రయాణం కూడా కాదు. బస్సయితే అరగంట." అని వేమయ్య అంటుండగానే కొండలు కాగితం పెన్సిలు తీసుకొని వచ్చాడు.

"వ్రాయరా వరుసగా అక్షరాలు తెలిసేటట్లు వ్రాయి." అన్నాడు గురవయ్య.

"అలాగేనండి .. చెప్పండి" గురవయ్య చెబుతూంటె కొండలు వ్రాస్తూ వచ్చాడు

"మూడు రంగుల నూలు మూడు ఉండలు.
తొమ్మిది మూరల మల్లు గుడ్డ ఒకటి
ముక్కాలు పాపి నిమ్మకాయలు నూట ఒకటొకటి
రాతి సాంబ్రాణి ఐదు పలాలు
మొలక సాంబ్రాణి ఐదు పలాలు
గడ్డ కర్పూరం మూడు పలాలు
ఊదువత్తు లు మూడు కట్టలు
చందనం పొడుము ఐదు పలాలు
కుంకం ఐదు పలాలు
పసుపు నాలుగు పలాలు (ఛాయ పసుపు)
తొలిచూలు కోడిపుంజు ఒకటి
కొబ్బరి కాయలు తొమ్మిది
ఇత్తడి తాయెత్తు రేకులు ఐదు
వెండి నామంరేకులు పన్నెండు.
ఇనుప చీలలు తొమ్మిది.
ముగ్గుపిండి బాగా జల్లించినది. (రెండు తవ్వలు.



త్రివ్రమన్నాడు గురవయ్య

నల్ల బియ్యం తొమ్మిది శేర్లు.
నల్ల గాజులు, ఆవాలు మూడు జతలు."

చెబుతూ చెబుతూ ఆగి పోయాడు గురవయ్య.

"పూర్తి అయిందాండీ?" ప్రశ్నించాడు వేమయ్య.

"ఇంకా ఏమైనా మరచానేమోనని ఆలోచిస్తున్నాను ఆ ... ఆ ... జ్ఞాపకానికి వచ్చింది. తమలపాకులు కలిపి వేలాకులు మూడు కవుళ్ళు. చెక్కాలు ఉడికించినవి పది వలాలు."

గురవయ్య ఇంటి పై కప్పును చూస్తూంటే కొండలు అన్నాడు.

"నెయ్యి రాయలేదు గదండీ?"

"అవును నిజమే. నెయ్యి మరచాను. కలపడం లేని ఆవు నెయ్యి శుద్ధమైనది కావాలి. ఈ మాత్రం చాలు. ఏదైనా ఒకటీ రెండూ మరచి ఉంటే అక్కడ జ్ఞాపకం చేస్తాను. అప్పుడు అవన్నీ కొనవలసినది. కాగా ఊళ్ళోనే దొరికేవి కొన్నిముందుగానే సేకరించాలి" అన్నాడు గురవయ్య.

"చెప్పండి" అంటూ ఆయన వంక చూశాడు వేమయ్య.

"నాలుగు మామిడి రెమ్మలు. నాదెడు వేపాకు, పూల్ లోక తట్టెడు. పుట్టమీద పెరిగిన మన్నొక బుట్టెడు. గోవుపాదం తొక్కని తుంగపోచలు మూడు. పాపటకాయ లోకపది. ఒక తొండ ప్రాణంతో ఉండాలి" అన్నాడు గురవయ్య.

"ఈ అన్నిటినీ సిద్ధం చేస్తాను. నిమిషాలు మీద పని. మీరు మాత్రం తప్పక రావాలి. ఆదివారం కాచుకొని ఉంటాను. ఇక సెలవా?" అంటూ పైకి లేవబోయాడు వేమయ్య. "అప్పుడే తొందరేం? భోంచేసి వెళ్ళవచ్చుగా!" అన్నాడు గురవయ్య.

"భోజనానికేం లెండి. ఎప్పుడైనా ఒక్కటే. అందుకోసం కాదు. ఆ యిప్పు దొరకదు. రాత్రికి వృథాగా కాలక్షేపం చేయవలసి వస్తుంది. ఇంటికి వెళితే ఈ పట్టీలో ఉన్నవన్నీ సదిచేసుకోవచ్చు. ఇంకేముంది? ఆదివారానికి రెండు రోజులేగా మధ్య" అంటూ కొండలు దగ్గరనుండి చీటీ తీసుకొని బయలుదేరాడు. గురవయ్య మర్యాద పూర్వకంగా వీధి దాటి వచ్చి సాగనంపాడు.

## 2

ఆదివారంనాడు వేమయ్యగారింటిలో హడావుడి ఎక్కువగానే ఉంది. ఇల్లూ వాకిలి ఊడ్చి ముగ్గు వేశారు. గొప్ప వంటేటం ఎత్తి సాంబ్రాణి ధూపాలు వేశారు.

సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకు వచ్చాడు గురవయ్య. ఆయన్ను చూడాలని గ్రామంలో చాల మంది వచ్చారు. గురవయ్య ఆకారంలో గొప్ప అందగాడు కాదు. ఐనా అతని కోలముఖంలో కొంత ఆకర్షణ ఉందనే చెప్పాలి. మీసలు సన్నగా మెలివేయబడి ఉంటాయి. చిన్న జుత్తు కూడా ఉంది. రెండు కనుబొమల మధ్య సన్నని చంద్ర వంకాకారంలో కుంకుమ పెట్టుకున్నాడు. శూన్యం పెట్టే వారు, శక్తిని వశం చేసుకున్నవారు అలాగే తిలకం పెట్టుకొంటారనీ, ఆ తిలకాన్ని చూచిందే అతనిలోని శక్తిని కనిపెట్టవచ్చునని కొందరంటారు. గురవయ్య గోళ్ళు బాగా ముదిరిపోయి ఉన్నాయి. ఆ గోళ్ళ పెంపకంలో అతడు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాడు. లేనిపక్షంలో అవి విరిగిపోయేవి. అన్నిటికంటే చిటికెన వ్రేలి గోరు పెద్దది. అది ఆ వ్రేలు పొడుగుంటుంది. గురవయ్య ఎడమ చేతి కొక బ్రహ్మముడి ఉన్నది. ఆ ముడిలోనే విపరీతమైన బలమున్నదని చాలామంది నమ్మకం.

ఆ రోజు అందరూ గురవయ్యను విచిత్రంగానే చూశారు. వేమయ్య ప్రతికథలు ఒకరిద్దరు మాత్రం ఉన్నారు. వారికిదంతా ఆశ్చర్యంగా కనిపించింది. తోట ఎండిపోయినందుకూ — గురవయ్య రాకకూ ఉన్న సంబంధం అర్థం కావటంలేదు. ఐనా ఊరుకున్నారు.

భోజనాలైన వెనుక వేమయ్య చెప్పాడు గురవయ్యతో, "తోట ఎండిపోవటం అటుంచి మరీ చిన్నెలు జరుగుతున్నాయి. నిన్నరాత్రి నేను కంటిమీద రెప్పవేయలేదు. ఆ మాను మళ్లె చెట్టునుండి ఒక్కటే శబ్దం. గలగల మంటూ చెవులు చిల్లులు పడుతున్నాయి. మా ఆవిడకు చెప్పానుగానీ దానికి వినబడలే దన్నది. ఇంతకూ మీరు వచ్చారుగా భయం లేదు" అన్నాడు.

గురవయ్య అంతా విని ఒక్కసారి వెళ్ళి మానుమళ్లె చెట్టును చుట్టి వచ్చాడు. చెట్టు క్రింద తేమగా ఉన్న ప్రదేశాన్ని కాలితో ఒత్తి చూశాడు.

"రాత్రి పన్నెండు గంటలకు పని ప్రారంభిద్దాము. మూడు గంటలకంతా పూర్తిచేయగలం. ఒక్క జాము పని. మీ రాత్రిగా అన్నీ సేకరించి పెట్టాలి. అన్నట్టు మీ కా దినం చెప్పడం మరచాను. రెండో కంటికి తెలియకుండా తొలి చూలు ఆడబిడ్డ తల వెంట్రుకలు మూడు సేకరించాలి. ఆ పిల్ల కన్యగా ఉంటే చాలా మంచిది." అన్నాడు గురవయ్య.

వేమయ్య దిగాలుపడి నిల్చున్నాడు.

"ఏం దొరకదా?" ప్రశ్నించాడు గురవయ్య.

వేమయ్య రెండుక్షణాలు ఆలోచించి. "ఉండండి, వస్తా"నంటూ లోపలకు వెళ్ళాడు. ఒక్క నిమిషంలో బయటకు వచ్చి "దొరుకుతుంది లెండి" అన్నాడు సంతృప్తిగా.

వేమయ్య భార్య రాగమ్మ ఆ సాయంకాలం ఆ వీధి చివర సుబ్బమ్మగారి ఇంటికి వెళ్ళింది. ఆమె కూతురు జానకి, ఆ మాట ఈ మాట మాట్లాడి జానకమ్మకు జడవేయడానికి కూచున్నది. ఆ సాకుతో నాలుగు వెంట్రుకలు సంపాదించి తెచ్చి పెట్టింది.

భోజనా లయిన వెనుక అందరూ పడుకున్నారు. ఆడవా ళ్ళెవరూ దగ్గరకు రాకూడదని గురవయ్య హెచ్చరికగా చెప్పాడు. మూలు పోగులను దారంగా పేడి పెట్టమని వేమయ్యను, కొండలును వినియోగించాడు. వేమయ్య సేద్యగాణ్ణి పిలిచి ఊరికి ఉత్తరంగా ఉండే మూడు బావులలో నీళ్ళు తీసుక రమ్మని పంపాడు.

అన్ని సామానులూ చేరాయో లేదో ఒక్కసారి సరి చూసుకున్నాడు. ఉన్నట్టుండి వేమయ్యతో అన్నాడు: "అరెరే! మరచి పోయాను. కళ్ళి కొమ్మలు రెండు కావాలి. ఒక్కొక్కదానికీ మూడు కొనలుండాలి. వాటికి నేతిలో అద్దిన కొత్త పేలికలు చుట్టి దీపం ముట్టించాలి."

వేమయ్య పైకి లేచి, "ఇక్కడేగా నిమిషములో వస్తాను." అంటూ లాంతరు పట్టుకెళ్ళాడు. వేమయ్య వెళ్ళగానే గురవయ్య కర్ర తీసుకొని మానుమళ్లె చెట్టు క్రిందికి వెళ్ళాడు. ఐదు నిమిషాలలో పనిని పూర్తి చేసుకొని వచ్చాడు.

ఆ వెనుక మూడు నిమిషాల కల్లా మూడు బావుల నీళ్ళు వచ్చాయి. కళ్ళి కొనలూ వచ్చాయి.

అప్పటికి పదకొండు గంటలైపై, వేమయ్యను గురవయ్య పిలిచి చెవిలో ఏదో రహస్యంగా చెప్పాడు. వెంటనే వేమయ్య పెరటి తలుపూ వాకిలి తలుపూ గడియలు బిగించాడు. సామాన్లన్నీ చేదబావి ప్రక్కగా ఉంచాడు.

గురవయ్య అప్పటి కప్పుడు చేద నీళ్ళు రెండు బక్కెట్లు నెత్తిన పోసుకున్నాడు. భయంకరంగా విభూతి పట్టెలు తీసుకొని ముఖాన కుంకం రేఖను దిద్దుకొన్నాడు. పేము బెత్తాన్ని చేత్తో పట్టుకొని "కొండలూ!" అన్నాడు. వాడు పెద్ద పీటను మాను మళ్లె చెట్టు క్రింద వేశాడు. ఆ పీట మీద కూర్చుని నేలను చదరంగా త్రోసి అలికించాడు. ఆ నేల ఆరక ముందే ముగ్గు వేశాడు. ఆ ముగ్గులో శిల్పం లేకపోయినా కావలసినంత క్రౌర్యం ఉంది. దాని చుట్టూ కొత్త గుడ్డను పరచాడు. ఆ బట్ట మీద బియ్యం పోయించాడు. ఆ బియ్యంమీద కుంకుమతో నే శూలం గుర్తులు వేశాడు. నిలువు గీతలు చుట్టూ పసుపు పోశాడు. ఇవన్నీ కొండలు గూడా చేస్తున్నా పని తెమల లేదు. పన్నెండున్నర కావచ్చింది. మధ్యలో కళ్ళి కొనలకు పేలికలు చుట్టి నేతిలో ముంచి దీపాలు వెలిగించారు. అవి మండుతున్నాయి. వరుసగా నిమ్మకాయలు కోసి రసాన్ని బొమ్మ మీద పిండి చుట్టూరా వేశారు. కొబ్బరి కాయల్ని గూడా పగల మొత్తేశారు. తెచ్చిన వస్తువుల నంతా ఏదో ఒకవిధంగా ఉపయోగించారు. సాంబ్రాణి వత్తులు ముట్టించారు. మరో ప్రక్క ధూపం వేశారు. గడ్డ కర్పూరంలో సగాన్ని ముట్టించి కోడి పిల్లను తెచ్చి జుత్తును కోసి నెత్తురు చూపించారు. తొండను మాత్రం మెడను కత్తిరించి పారేశారు.

గురవయ్య కూర్చున్నాడు దిట్టంగా ధ్యానంలో అరగంట సేపు. ఆ వెనుక తమలపాకును తీసుకొని కాటుక రంగరించి అరచేతిలో పెట్టుకొని చూశాడు. మళ్ళీ దీపంపైన పెట్టి చూశాడు.

"వేమయ్య గారూ?" పిలిచాడు గురవయ్య.

వేమయ్య చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"గునపం తీసుకరా" అన్నాడు గురవయ్య.

వేమయ్య సేద్యగాడు సుబ్బులు ఒక్కడుగులో లోపలకు వెళ్ళి గునపం తెచ్చాడు.

"అదుగో... ఆ ముగ్గుకు సరిగ్గా బొట్టు దగ్గర త్రవ్వు" అన్నాడు గురవయ్య. సుబ్బులు త్రవ్వాడు. నిమిషానికంతా మూర తెగింది. ఆశ్చర్యం... లోపల చిన్న సత్తు చెంబు కన్పించింది. సుబ్బులు తాకబోతుంటే "ఆగు... ఆగు... మూర్ఖుడా" గద్దించాడు గురవయ్య. సుబ్బులు ఉలిక్కిపడి వెనక్కి వచ్చాడు.

"దానికి నెత్తురు చూపకనే తాకితే ఏమవుతావో తెలుసా?" అంటూ గురవయ్య ఉరిమి చూసి పైకి లేచాడు. కొండలు చాకును అందించాడు. గురవయ్య ఆ చాకుతో తన చిటికెన వ్రేలును మెల్లిగా గీసి ఒక్క చుక్క నెత్తురును మాత్రం బయటకు తీసి చెంబు మీద తిలకం లాగా పెట్టి, కాసేపు కర్పూరం ముట్టించి, పిడికెడు సాంబ్రాణి ధూపం వేసి చెంబును పైకి తీశాడు.

వేమయ్య గుడ్లప్పగించి చూస్తున్నాడు. గురవయ్య ఆ చెంబులోనుండి పైకి తీశాడు వస్తువులు.

ఒక పంది ముల్లు, ఒక చిన్న చేతి ఎముక మణికట్టు వరకూ, మూడు వెంట్రుకల ఉండలు, మూడు ఇనుప చీలలు, ఏవో చదవడానికి వీలుగాని అక్షరాలు వ్రాయబడిన రాగి రేకు, ఒక పసుపు గుడ్డలో చుట్టబడిన మూడు దమ్మిడీలు.

వాటిని చూడగానే వేమయ్య పెదవులపై చిరునవ్వు వెలిగింది. గురవయ్య వాటినంతా ఆ చెంబు లోనే పెట్టి కొండలు దగ్గర ఉంచాడు.

ఇక మిగిలినంత వెత్తం దన్నారు. నిమిషాల మీద కొండలన్నిటినీ సర్దుకొట్టాడు. అందరూ వెళ్ళి పడుకున్నారు. ఉదయం ఆ సామగ్రినంతా కొండలు ఊరికి చేర్చి మధ్యాహ్నానికల్లా తిరుపమీదు వచ్చాడు. గురవయ్యను ఇద్దరు ముగ్గురు ఊళ్ళో నిలిచి సొమ్మని బలవంతం చేశారు. ఒకాయన ఇంటిలో అదృష్ట శక్తిని స్థాపితం చేసుకోవాలనీ, ఇంకో ఆయన తన మరదలికి దయ్యాన్ని వదిలించాలనీ. మూడో ఆయన తనకే వశీకరణ యంత్రం కట్టుకోవాలనీ. ఈ మూడు గిరాకీలతో గురవయ్య ఆగిపోవలసి వచ్చింది.

ఆ మరునాడు రాత్రి సరిగ్గా పన్నెండు గంటల ప్రాంతు వేమయ్య ఇంటిమీద రాళ్ళ వర్షం కురిసింది. వేమయ్య అదిరిపడి గురవయ్యను లేపాడు. గురవయ్య క్షణం ఆలోచించి, "తెలిసింది పడుకోండి. ప్రొద్దునే చెబుతాను" అన్నాడు. వేమయ్య బెదురు గుండెలతో పడుకున్నాడు. కానీ ఆ రాత్రి నిద్ర పోలేదు. ఉదయం గురవయ్య నిద్ర లేవకముందే వేమయ్య ఇంటి మీద పడ్డ రాళ్ళనంతా కుప్పపోసి పెట్టాడు. దాదాపు నలభై రాళ్ళ దాకా ఉన్నాయి. గురవయ్యను తొందరగా లేపి చూపెట్టాడు. అతను ఆవలిస్తూ "ఏమీ కంగారు పడకు. మనం సాధించిన శక్తి తిరుగ బడింది. రాత్రికి తగిన పని చేస్తే పోతుంది" అన్నాడు.

వేమయ్య దీనంగా ముఖం పెట్టి అన్నాడు: "ఏదో పుణ్యం గట్టుకోండి. తోట ఎండి పోయింది గదా అంతటితో పోతుం దనుకున్నాను. ఇంటి మీదకు కూడా దాడి తీస్తే ఇక గతేముంది."

"రాత్రికి ఏమీ అవసరం లేదు గాని ఓ నల్లకోడి పిల్ల, మూడే మూడు నిమ్మకాయలు ఒక రాగిరేకు సరిచేయండి. పని చేసి ఇస్తాను. ఆ రేకును ద్వార బంధానికి తగిలించితే చాలు. ఏ కీడూ జరుగదు" అన్నాడు.

ఆ రాత్రి కావలసిన వన్నీ సరిచేశాడు వేమయ్య. గురవయ్య రేకు మీద ఏవో వంకర గీతలు గీసి ఒక చెక్కకు చీలలు కొట్టి బిగించాడు. దానికి ధూప దీప నైవేద్యాలు చేసి నెత్తురు చూపి ప్రతిష్ఠించి ఇలా అన్నాడు:

"ఇది చాలా గొప్పది. ప్రతి శుక్రవారం తప్పకుండా పూజ చేస్తూ వుండాలి. మైల పడ్డవా రెవరూ తాక గూడదు. నియమాలను ఉల్లంఘించితే ప్రమాదాలకు దారితీయ వచ్చు. బాధ్యత నాది గాదు" అన్నాడు. వేమయ్య చిత్తం అన్నాడు.

(మిగతా 60 వ పేజీలో)

# ★ శూన్యం ★

(20 వ పేజీ తరువాయి)

ఆ రాత్రే గ్రామంలో మిగిలిన పనులు కూడా చూశారు. లింగయ్యగారింటిలో అదృష్ట చక్రాన్ని ప్రతిష్ఠించారు. ఖర్చులు వంద రూపాయలుంటాయి. అందులో గురవయ్యకు ఆదాయం యాభై రూపాయలైనా అదేమంత పెద్ద మొత్తం గాదు. కేశవయ్య గారమ్మాయిని కూర్చోపెట్టి తలపైన కుడి చేతిని పెట్టి ఏదో గొణిగాడంతే! తక్షణం ఆమె ఊగుతూ సమీపంలో నున్న పెద్ద బండనెత్తి నెత్తిమీద పెట్టుకొని రెండు ఫర్లాంగులు నడిచింది. అక్కడొక ఈత చెట్టు దగ్గర గుండును దభాలమని క్రింద పడవేసింది. గురవయ్య ఆమె కొప్పునుండి మూడు వెంట్రుకలు కత్తిరించుకున్నాడు. ఈతచెట్టుకొక ఇనుప మేకును దించి ఆ మేకుకు ఆ వెంట్రుకలను చుట్టివేశాడు. ఆ స్త్రీ తక్షణం పైకి లేచి ఒళ్ళు విరుచుకొని ఇంటి ముఖం పట్టింది. ఆ నాటి నుండి ఆ ఈతచెట్టును దయ్యం చెట్టంటారు. మంచి మధ్యాహ్నం కానీ, రాత్రిపూట కానీ, ఆ దారిలో ఒంటరిగా ఎవరూ వెళ్ళరు. బహుశా ఏ ధైర్యశాలియో వెళ్ళడం జరిగితే అతడు తన చేతిలో కనీసం ఒక ఇనుప ముక్కనైనా ఉంచుకొని వెడతాడు. అలా వెళ్ళితే ఏ దయ్యమూ దగ్గరచేరదని చాలామంది నమ్మకం.

గురవయ్య గారిని ఆశ్రయించిన కామయ్యగారికి వశీకరణయంత్రంకూడా కట్టి యిచ్చాడు. ఈ ఖర్చు ఈవ్యవహారాలు అతిగోప్యంగా ఉంచబడినవి. కామయ్య ముందుగా వంద రూపాయలు చేతిలో పెట్టి ఫలితం చూచుకొని మరో వంద యిస్తానన్నాడు.

మొత్తంమీద గురవయ్య కా రెండు రోజుల్లో మూడు వందల రూపాయలు ఆదాయం వచ్చింది. ఆయన చిరునవ్వుతో అందరినీ పలకరించి, వారత్యంత శ్రద్ధాభక్తులతో వీడ్కోలివ్వగా సెలవు పుచ్చుకొన్నాడు. కొండలు సామగ్రి నంతా సుబ్బులు వద్ద మోయించుకొని రోడ్డుకు వచ్చాడు. ఈ లోగా ఒక విచిత్రం జరిగింది. అప్పుడే ఊరికి వెడుతున్న మునసబుగా రబ్బాయి పూర్ణయ్య శూన్యాల గురవయ్యను, అతని వేషాన్ని ఎగాదిగా చూచి,

"ఇతడేనా పూడికతీసింది?" అన్నాడు వేమయ్యతో.

"అవు నన్నాడు వేమయ్య.

"ఏమాత్రం వేశాడు టోపీ?" అని ప్రశ్నించాడు పూర్ణయ్య.

ఈ మాటతో వేమయ్య ఉలిక్కిపడ్డాడు. గురవయ్య పూర్ణయ్యవంక నిర్లక్ష్యంగా చూస్తూ "కొంచెం మర్యాదగా మాట్లాడండి" అన్నాడు.

"మర్యాద కూడా కావాలి? మీ వంటి వాళ్ళనంతా అరెస్టు చేయించి అండమాన్సుకు పంపాలి గొప్పగా వీడ్కోలిచ్చి, అప్పుడే ఈ దేశానికి పట్టిన శని విరగడౌతుంది." అన్నాడు పూర్ణయ్య పళ్ళు కొరుకుతూ.

"మీరు ఊరుకోండి గురవయ్యగ్యారూ! ఈఊళ్ళో అంతా కడుపు మంటే" అన్నాడు అదృష్ట చక్రాన్ని ప్రతిష్ఠించుకొన్న లింగయ్య.

పూర్ణయ్య కేం సమాధానం చెప్పాలో తోచక పోయింది. ఇంతలో బస్సు రానేవచ్చింది. గురవయ్య, కొండలూ బస్సు ఎక్కారు. పూర్ణయ్య గూడా ఎక్కాడు.

బస్సు కదులుతుంటే "అప్పుడప్పుడూ జాబులు వ్రాయించండి" అన్నాడు వేమయ్య. గురవయ్య "అలాగే తప్పక" అంటూ పూర్ణయ్య వంక చూశాడు.

## 4

వారం రోజులకల్లా వర్షం కురిసింది. పెద్ద వర్షం కావడం వల్ల కుంటలన్నీ నిండి పోయాయి. చచ్చిపోయా యనుకొన్న మామిడి చెట్లు చిగురు లెత్తడంతో వేమయ్య బ్రహ్మానందభరితు డయ్యాడు. ఇదంతా శూన్యాల గురవయ్య గారి చలవే. లింగయ్య గారింట్లో అదృష్ట చక్ర ప్రతిష్ఠాపన ఫలితం కూడా మూడు మాసాలకే కనిపించింది. అతడు పెరటిలో వంటకొక చిన్న గదిని కట్టించడానికి పునాది త్రవ్విస్తుంటే లిబ్బి దొరికింది. ఒక్క బిందె నిండుకూ విక్టోరియా రాణి ముద్ర గల వెండి రూపాయలు. కేశవయ్య మరదల కానాటితో దయ్యం వదిలింది. ఆమెకు నెల తప్పి రెండు మాసాలైనై.

కామయ్య పంతం కూడా నెగ్గింది. ఐనా ఆ విషయం చాలా రహస్యమైంది. ఆ గ్రామంలో ఏకాకిగా ఉన్న ఒక వితంతువు. నలభై వేలు ఆస్తి ఉంది. ఇంకా వారసులు ఫలానా వారని లేదు. కామయ్య ఆమె అభిమానాన్ని చూరగొన్నాడు. ఇవన్నీ ఎవరి మహాత్యంతో జరిగినవి? సందేహం లేదు. అన్నీ శూన్యాల గురవయ్యగారి పనితనమేనని చాలామంది గట్టిగా విశ్వసించారు. పూర్ణయ్య చాలా తీవ్రంగా ఖండించాడు వీరి వాదన్ని. కానీ అతనిలో పట్టు లేక పోయింది.

ఊళ్ళో చాలమంది గురవయ్యగారిని పిలిపించాలని అనుకున్నారు. ఈ మారు ఇంటికో అదృష్ట చక్రాన్ని ప్రతిష్ఠించుకోవాలని నిర్ణయించుకొన్నారు. పూర్ణయ్య ప్రతి ఒక్కనికీ చెప్పాడు. ఇవన్నీ శుద్ధ దండుగన్నాడు. ఆ పూడికలు వారే పెట్టి తీస్తారని వాదించాడు. రాళ్ళు వేసిం దతని శిష్యుడై ఉంటాడని ఊహించడం తప్పు గాదన్నాడు.

ఈ పేలవమైన వాదనను విని అంతా నవ్వు కోడంతో పాటు "ఏదో అదృష్టాన్ని తెచ్చుకొంటామంటే అడ్డగించే చిన్న బుద్ధి లెందుకని" చాటు మాటున విమర్శించారు.

వేమయ్యగారు మాత్రం గురవయ్య దగ్గరకు వెళ్ళి ఆహ్వానించి వచ్చాడు.

ఇరవై ఇండ్లకు అదృష్ట చక్రాలు ప్రతిష్ఠించాలని— పన్నెండిండ్లలో పూడిక తియ్యాలని కనీసం వారంరోజు లుండవలసి వస్తుందని చెప్పి వచ్చాడు. ఈ విషయం పూర్ణయ్యగారికి తెలిసి విచారపడ్డాడు. ఎదిరిస్తే గ్రామమే విరోధ మౌతుందని అతనికి తెలుసు. జరిగేది జరగనని ఊరుకున్నాడు.

వారం రోజులు జరిగినాయి గానీ గురవయ్య రాలేదు. మళ్ళీ రెండు రోజులు చూచి వేమయ్యే స్వయంగావెళ్ళాడు. చిత్తూరులో బస్సు స్టాండు వద్ద నిల్చుని ఆ ఊరి బస్సుకోసం ఎదురు చూస్తున్నాడు. ఇంతలో రోడ్డు వెంబడి ఒక ఖైదీ ముందొక పోలీసు వెనుకొక పోలీసు వెడుతున్నారు. ఖైదీ ముఖం కన్పించకుండా ముసుగు వేసుకున్నట్లు కన్పించినా బేడీలు వేసిన చేతులు బాగా కన్పిస్తున్నాయి. బ్రహ్మ ముడిని చూడగానే వేమయ్యకు గురవయ్య జ్ఞాపకానికి వచ్చాడు. అప్రయత్నంగా ముందుకు వెళ్ళి చూచాడు. ఆశ్చర్యం! గురవయ్యే. శూన్యాల గురవయ్యే. వేమయ్యను ఓర కంటితో చూచి తలను మరీ క్రిందకు దించుకొన్నాడు.

ఆ వెనుకనే ఏడుపు ముఖంతో వస్తున్న కొండలు చెప్పాడు "ఆరు మాసాలు జెయిలు శిక్ష" అని.

"ఎందుకూ?" ప్రశ్నించాడు వేమయ్య.

"తిరుత్తణి దగ్గరొక పల్లెకు పూడికెత్తా అని వెళ్ళాము. ఆ రాత్రి పని చూసుకొని పొద్దున్నే ఇంటికి వచ్చాము. సాయంకాలానికంతా పోలీసులు వచ్చి పట్టుకొన్నారు. ఆ ఇంట్లో రెండువేల రూపాయల నగలు, వెయ్యి రూపాయల నగదూ పోయిందనీ, మేమే చేశామని కేసు" అన్నాడు కొండలు.

"సొమ్ము దొరికిందా?" ఈ ప్రశ్నకు జవాబుగా కొండ లేదో వేమయ్య చెవిలో చెప్పాడు. వేమయ్య వెనక్కు తిరిగి తాను వచ్చిన బస్సులోనే ఎక్కి కూర్చున్నాడు. గ్రామంలో ఎదురు చూస్తున్న వారికి చాలా నిరుత్సాహం కల్గింది.

ఆ మరునాడు పత్రికలో పడ్డ వార్తను పూర్ణయ్య నవ్వుతూ అందరికీ చూపెట్టినా వారు నమ్మలేదు. గురవయ్యలో ఉన్న శక్తి వారికి తెలిసినట్లు పూర్ణయ్యకు తెలియదు.

ఆరు మాసాలు గడిచినా గురవయ్య రాలేదు. అతడేమైనాడో తెలుసుకోడానికి వేమయ్య ప్రయత్నించాడు. కానీ, ఫలితం లేక పోయింది. కనీసం అంజని కప్పు వేయడమైనా నేర్చుకొని ఉంటే ఎక్కడున్నదీ తెలుసుకో వచ్చునని వేమయ్య చింతించాడు. అదృష్ట చక్రం ప్రతిష్ఠించుకోవా లనుకున్నవారు హతాశులై పోయారు.

ఇంతకూ శూన్యాల గురవయ్య ఏమైనట్టు? ఒక్క ఏడాది గడిచాక ఆ గ్రామానికి చుట్టం చూపుగా వచ్చిన కొండలు చెప్పాడు— ఆ ...నికే ఎవరో శూన్యం పెట్టారనీ, ఆ పెట్టిన కంటే పనివాడనీ—. ఈ మాటను ఒక్క... తప్ప వినిగలవారంతా గట్టిగా నమ్మారు.